క్లుప్తంగా

నేడు న్యాయవాదులకు చట్టాలపై అవగాహన తరగతులు

తిరుపతి లీగల్ : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్లో న్యాయవాదులకు వివిధ చట్టాలపై జడ్జిలు అవగాహన కల్పించనున్నట్లు ఐలు కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్ ముఖ్య అతిథిగా హాజరై తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు. తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.అన్వర్‌బాషా రాష్ట్ర భూహక్కు చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 41ఏ, హిందూ వారసత్వ చట్టంపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఐలు కార్యవర్గ సభ్యులు దేవరాజులు, హరికృష్ణారెడ్డి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

10 నుంచి గోవిందరాజస్వామి అధ్యయనోత్సవాలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 2 వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి ఏటా ఆలయంలో అధ్యయనోత్సవాల సందర్భంగా దివ్యప్రబంధాన్ని పారాయణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ప్రతి రోజూ రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, సేనాధిపతి, ఆళ్వార్ల సమక్షంలో దివ్యప్రబంధాన్ని పారాయణం చేస్తారు. 20న చిన్న శాత్తుమొర, 26న ప్రణయ కలహోత్సవం, 30న పెద్ద శాత్తుమొర నిర్వహిస్తారు.

ఘనంగా సుమంగళి పూజ

తిరుపతి కల్చరల్: శ్రీనగర్‌లోని ఓం శక్తి అమ్మవారి ఆలయంలో శుక్రవారం సుమంగళి పూజను ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మంది స్థానిక మహిళలు ఓం శక్తి మాలధారణ దీక్ష చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గెరిగలను ఊరేగించారు. ఆలయ ధర్మకర్త కె.హేమలత, డాలర్స్ గ్రూప్ చైర్మన్ సి.దివాకర్ రెడ్డి, టి.రూపేష్, నవన్, అఖి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండా యి. గురువారం అర్ధరాత్రి వరకు 59,522 మంది స్వామివారిని దర్శించుకోగా 18,544 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.51 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టికెట్లు లేని వారికి 15 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లున్న వారికి 2 గంటలు పడుతోంది.

మహిళా వర్సిటీలో స్కిల్స్‌పై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా శుక్రవారం ట్రాన్స్‌ఫరబుల్ స్కిల్స్ అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు ప్రారంభించారు. మహేంద్ర ప్రైడ్‌క్లాసు రూమ్ ప్రాజెక్ట్ నాంది ఫౌండేషన్ గ్రూప్ శిక్షకులు వై రజని కుమారి, ఆయేషా షేక్ ఎంసీఏ విద్యార్థులకు 18 అంశములపై శిక్షణ ఇవ్వనున్నారు.

జెర్రిపోతు కలకలం



తిరుమల : బాలాజీనగర్‌లోని ఓ ఇంటిలో శుక్రవారం జెర్రిపోతు పాము దూరి కలకలం సృష్టించింది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర నాయుడు అక్కడికి చేరుకుని ఏడు అడుగుల పామును చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం దాన్ని అవ్వాచారి కోనలో విడిచిపెట్టారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

తిరుపతి రూరల్ : తిరుపతిలోని రవీంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు వల్ల శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా జగనన్న పథకాలు

- అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి
- మాస్టర్ ప్లాన్ రోడ్లతో ట్రాఫిక్‌కు చెక్
- రూ.3 వేల పెన్షన్ పంపిణీలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



పెన్షన్ల పంపిణీకి హాజరైన లబ్ధిదారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోతాయని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణతో కలిసి తిరుపతి ఎంఆర్ పల్లి సర్కిల్‌లో రూ.3 వేల పెన్షన్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదప్రజల సంక్షేమం కోసం రూ.3.35 లక్షల కోట్లు అందించిన నాయకుడు జగనన్న అని అన్నారు. పెత్తందారులకు కొమ్ముకాస్తూ పేదలను విస్మరించిన ప్రజాద్రోహి చంద్రబాబు అని, వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేస్తే ప్రజలను నట్టేట ముంచేస్తాడని హెచ్చరించారు. జగనన్న లాంటి నాయకుడు అధికారంలో ఉంటే ప్రతి పేదవాడు గుండెపై చేయి వేసుకుని ప్రశాంతంగా నిద్రపోవచ్చన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

40 ఏళ్లలో ఏ ప్రభుత్వాలూ చేయలేని విధంగా నాలుగున్నరేళ్లలోనే తిరుపతిని అభివృద్ధి చేసి చూపామని, వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదించాలని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి అభ్యర్థించారు. రూ.1700 కోట్లతో తిరుపతి నగరాన్ని అభివృద్ధి చేశామని, జగనన్న సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. 18 మాస్టర్ ప్లాన్ రోడ్లతో ట్రాఫిక్‌కు చెక్ పెట్టామని, ఈ ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. 22ఏ రద్దుతో సుమారు 7 వేల మందికి రిజిస్ట్రేషన్ల సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. తిరుపతి నగరంలో ప్రతి వీధికి సీసీ కెమెరాలు అమర్చి క్రైం ఫ్రీ నగరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పా రు. దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ ఏకాభిప్రాయ తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. టీటీడీ నిధులు రాకుండా అడ్డుకునేందుకు కొందరు కోర్టుకు వెళ్లారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ మరో 20 ఏళ్లకు కూడా జరగనంతగా తిరుపతిని అభివృద్ధి చేసిన ఘనత భూమన అభినయ్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా నిరంతరం ప్రజా సంక్షేమం, నగర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని చూసి అభినయ్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాముల రమేష్ రెడ్డి, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె. బాబు, కార్పొరేటర్లు ఆరణి సంధ్య, తాళూరి రత్నకుమారి, మోహన్‌యాదవ్, శాలిని, క్లస్టర్ ఇన్‌చార్జ్ పడమటి కుమార్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, మాకం చంద్ర, వెంకటమునిరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, అనీల్, రమేష్‌రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

విద్యా ప్రదాత సీఎం జగన్



స్టూడెంట్ యూనియన్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల విద్యార్థుల విద్యకు చేయూత ఇస్తూ సీఎం జగన్ విద్యా ప్రదాతగా నిలుస్తున్నారని తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తుమ్మలగుంటలో ఎస్వీయూ వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా దీవెన, సివిల్ సర్వీస్ ప్రోత్సాహక పథకం తదితరాలను జగనన్న ప్రవేశ పెట్టారని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రేమ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా అభిమానం



హారతి పట్టి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

చంద్రగిరి: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి చంద్రగిరి పంచాయతీలో శుక్రవారం చేపట్టిన గడప గడపకూ మహా పాదయాత్రకు ప్రతి ఇంటా అభిమానం వెల్లువెత్తింది. సర్పంచ్ ముదికుప్పం రూప అధ్యక్షతన ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డితో కలిసి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల జాబితాను అందజేశారు. హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు విరజిమ్మాయన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా మోహిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ చేగు గోవర్ధన్ గుప్త, మట్టా మధుసూదన్ రెడ్డి, అగరాల దేవారెడ్డి, భోస్ చంద్రారెడ్డి, మస్తాన్, ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, అజీత్ సుబ్రత్, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ముదికుప్పం రామ్మూర్తి, బాహర్, కోలా మల్లి, కొత్తపాటి కోటి, హరి, కాశి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ వీసీల కాన్ఫరెన్స్‌లో మహిళా వర్సిటీ వీసీ



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి సిటీ : తంజావూరులోని సస్త యూనివర్సిటీలో శుక్రవారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, స్టేట్ ట్రైబల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన సౌత్ జోన్ వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్‌లో లీడ్ చైర్ పర్సన్‌గా పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి వ్యవహరించారు. ఈ కాన్ఫరెన్స్ ముఖ్య ఉద్దేశం న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 అమలు. మహిళా వర్సిటీ వీసీ మాట్లాడుతూ పాలనా, స్వయంప్రతిపత్తి అనే అంశాన్ని వివరించారు. యూజీసీ చైర్మన్ ఎం జగదీశ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ చైర్మన్ ఎస్ఎస్ కాల్సీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా బీస్



బీస్ డైరీని ఆవిష్కరిస్తున్న నీలం నరేంద్రనాథ్

తిరుపతి రూరల్: పేదలకు బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి (బీస్) అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం నరేంద్రనాథ్, కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో శుక్రవారం రాత్రి బీస్ డైరీ–2024 ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న బలిజ ఉద్యోగుల పరస్పర సహకారం కోసం బీస్‌ను ఏర్పాటు చేశామని, తద్వారా వివిధ కులాల్లో ఉన్న పేదలను ఆదుకుంటామన్నారు. నెల్లూరు బీస్ వ్యవస్థాపకులు అనీల్‌కుమార్, బీస్ ఉపాధ్యక్షుడు లక్ష్మినారాయణ, రవికుమార్, అమర్‌బాబు, లక్ష్మీప్రసాద్, ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీలక్ష్మి, సత్యనారాయణ, ముని శంకరయ్య, బాలాజీ, మధుసూదన్, జయప్రకాష్, శివకుమార్, వరప్రసాద్, మోహన్ పాల్గొన్నారు.

విద్వాస్‌లో అలరించిన గీతావధానం



అవధాని హేమవెంకటనారాయణను సత్కరిస్తున్న విద్వాస్ స్కూల్ యాజమాన్యం

తిరుపతి రూరల్ : రూరల్ మండలం కాలూరులోని విద్వాస్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన గీతావధానం కార్యక్రమం ఆహూతులను అలరించింది. అవధాని హేమవెంకటనారాయణ శ్లోక సంఖ్య చెబితే శ్లోకాన్ని చెప్పడం, అక్షర సంఖ్య చెప్పడం, విలోమంగా శ్లోకాన్ని చదవడం, అఖండ పారాయణం చేయడం వంటి అంశాలను సమర్థంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు అవధాని చక్కగా సమాధానాలను చెప్పి మెప్పించారు. బాల్యం నుంచే భగవద్గీతను చదవడం వల్ల వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆచార్య కందనూరు శేషయ్య పేర్కొన్నారు. అవధాని హేమవెంకటనారాయణను స్కూల్ చైర్మన్ జయచంద్రారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆదిత్యశర్మ, అరుణాచలరెడ్డి, సుకుమార్‌రెడ్డి, చరిత, మురళి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

తిరుపతి కల్చరల్: ప్రమాదంలో పడిన భారత రాజ్యాంగాన్ని మనువాదుల నుంచి పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మతోన్మాద బీజేపీని ఓడించి దేశాన్ని కాపాడుకుందామని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో మతోన్మాద బీజేపీని ఓడిద్దాం– దేశాన్ని కాపాడుకుందాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు రాఘవశర్మ, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పి.అంజయ్య సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వి.నాగరాజు, పి.మురళి, బీఆర్ఎస్ నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆమ్ ఆద్మీ నేత బెల్లంకొండ సురేష్, వీసీకే నేత రమేష్, బీఎస్పీ నేత జయచంద్ర, రచయిత గొడుగు చింత గోవిందయ్య, డీఎంసీ భాస్కర్ పలు విషయాలపై చర్చించారు. వారు మతం పేరుతో బీజేపీ, దేవుడి పేరుతో మఠాధిపతులు ఏకపక్షంగా తాము చెప్పిందే శాసనం అని, తమ నిర్ణయాలకు ఎవరు అడ్డు వచ్చినా అడ్డుకట్ట వేస్తామని చెబుతూ అహంకార పూరిత విధానాన్ని అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. మోదీ గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో మత విద్వేషాలు సృష్టించి 2 వేల మంది ముస్లింలను ఊచకోత కోశాడని ఆరోపించారు. ఇప్పుడు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాడని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో ఓడించి గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

తిరుపతిలో హోమ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫర్నీచర్, గార్మెంట్స్ అండ్ హోమ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోను శుక్రవారం ఎక్స్‌పో ఆర్గనైజర్ రాధాక్రిష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎక్స్‌పో 6, 7, 8వ తేదీల్లో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు. ఇందులో ఆధునాతనమైన ఫర్నీచర్ అండ్ ఫర్నీషింగ్, హోమ్ ఇంటీరియల్ ప్రొడక్ట్స్, దుస్తులు, జ్యువెలరీస్, కిచెన్ అప్లైయెన్సెస్, హెల్త్ అండ్ బ్యూటీ ప్రొడక్ట్, ఫుడ్ ప్రొడక్ట్స్ లభిస్తాయన్నారు. మెగా సంక్రాంతి సేల్‌లో భాగంగా హోల్‌సేల్ ధరలకే అందిస్తున్నట్లు తెలిపారు.

జగనన్న పాలనలోనే మహిళా అభ్యున్నతి

తిరుపతి మంగళం: మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారంటే అది ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయనను శుక్రవారం మహిళా సంఘాల ఆర్పీలు, సంఘాల మహిళలు గజమాలలతో సత్కరించి తమ మద్దతు తెలిపారు. నగర అభివృద్ధి, మహిళా సంక్షేమం కోసం కృషి చేస్తున్న అభినయ్‌రెడ్డి అధికారంలో ఉంటే మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



నటీమణులు జాహ్నవి కపూర్, మహేశ్వరి

తిరుమల: శ్రీవారిని శుక్రవారం టీటీడీ మాజీ ఈవో అనీల్ కుమార్ సింగాల్, మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాల కృష్ణ, మెరుగు నాగార్జున, సినీనటులు జాహ్నవి కపూర్, మహేశ్వరి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

న్యాయవాదిపై కేసు నమోదు

తిరుపతి క్రైమ్: కత్తులతో బెదిరించి భూకబ్జాకు యత్నించిన న్యాయవాదిపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. బోయనపాటి మాధవనాయుడు కుమార్తె రెడ్డిప్రసన్నకు చెందిన పాత తిరుచానూరురోడ్డు అశోక్ నగర్‌లో స్థలం ఉంది. దాని పక్కనే ఆమె పెదనాన్న కుమార్తె మమత స్థలం ఉంది. అందులో కొంత భాగాన్ని గ్రీన్‌పార్క్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న క్రిష్ణమూర్తి కొనుగోలుచేశాడు. రెడ్డిప్రసన్న స్థలంలో 20 అడుగులను ఉచితంగా ఆలయానికి ఇవ్వాలని క్రిష్ణమూర్తి డిమాండ్ చేయసాగాడు. గత నెల 28న ఆ స్థలంలో ఉన్న 20 ఏళ్ల టేకు చెట్టును రాత్రిపూట క్రిష్ణమూర్తి నరికించేశాడు. దాన్ని ప్రశ్నించిన రెడ్డిప్రసన్న భర్త అజయ్ ప్రతాప్‌ను కత్తితో బెదిరించి దాడి చేసేందుకు యత్నించాడు. అంతేగాక స్థలంలో కొంత భాగం తనదేనని పేర్కొన్నాడు. దీనిపై రెడ్డిప్రసన్న గతనెల 30న ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం తన స్థలానికి ప్రహరీ నిర్మించుకున్నారు. 3వ తేదీ అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ గోడను కూల్చేశారు. దీనిపై బాధితులు మళ్లీ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి క్రిష్ణమూర్తిపై కేసు నమోదుచేశారు. అలాగే పక్క స్థలం యజమాని మమతను బెదిరించారని రెడ్డి ప్రసన్న పైనా కేసు నమోదు చేశారు.

జగనన్న పాలన చిరస్మరణీయం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: జగనన్న పాలన, చెవిరెడ్డి ముందు చూపుతో చంద్రగిరి నియోజకవర్గ రూపురేఖలు మారాయని, చంద్రగిరి చరిత్రలో జగనన్న పాలన చిరస్మరణీయమని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి తెలిపారు. ఆమె శుక్రవారం బ్రాహ్మణపట్టు గ్రామంలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రగిరి ఎమ్మెల్యేగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనునిత్యం చంద్రగిరి ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారని తెలిపారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నాను అంటూ.. అండగా నిలిచారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ వేముల యశోద, ఎంపీటీసీ యోగానందరెడ్డి, సర్పంచ్ నాగజ్యోతి, సుబ్రమణ్యంరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వేణు, ప్రభాకర్‌రెడ్డి, స్వరూప పాల్గొన్నారు.

రవికాంత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి సిటీ : ఎస్వీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థి రవికాంత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ బి.అమరనాథ్ పర్యవేక్షణలో ఏ స్టడీ ఆన్ ది ఇంపాక్ట్ ఆఫ్ సేల్స్ ప్రమోషన్ ఆన్ ది ప్రైవేట్ లేబుల్ బ్రాండ్స్ ఆఫ్ సెలెక్ట్ ఆర్గనైజ్డ్ రిటైల్ అవుట్‌లెట్స్ ఇన్ ఏపీ అండ్ తెలంగాణా అనే అంశంపై పరిశోధన చేశారు.

ఎస్వీయూ వీసీకి ఘన సన్మానం



తిరుపతి సిటీ : ఎస్వీయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన వి శ్రీకాంత్‌రెడ్డిని ఎమరాల్డ్స్ విద్యాసంస్థల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. వర్సిటీని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.

వీసీ సన్మానిస్తున్న విద్యాసంస్థల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్

డోలు విద్వాన్‌కు సన్మానం

తిరుపతి తుడా: ప్రముఖ డోలు విద్వాన్ వీఎస్ బాలచంద్రను ఆయన శిష్యులు శుక్రవారం ఘనంగా సత్కరించింది. ఆయన స్వగృహానికి చేరుకున్న ఎస్వీ సంగీత నృత్య కళాశాల డోలు విభాగాధిపతి వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 30 మంది కళాకారులు డోలు విద్వాన్ బాలచంద్ర దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. డోలు వాయిద్యంలో తమ ఎదుగుదలకు, ఉన్నతికి సంపూర్ణ మద్దతు ఇచ్చి ప్రోత్సహించిన గురువర్యులు బాలచంద్ర సేవలు మరువలేనివి అని వై.శ్రీనివాసులు పేర్కొన్నారు. నాగరాజు, హరిబాబు, నాగేశ్వరరావు, బాలాజీ, గిరి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మట్టి గ్లాసుల వినియోగంపై అవగాహన

తిరుమల: తిరుమల పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా టీ దుకాణాల్లో మట్టి గ్లాసులు వినియోగించేలా అవగాహన కల్పిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించి భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

ప్రశ్న : నడక మార్గాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయండి. – ప్రసాద్, హైదరాబాద్

ఈవో : నడక మార్గాల్లో గ్లోబల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మూడు ప్రథమ చికిత్స కేంద్రాలు ఉన్నాయి.

ప్రశ్న : సీనియర్ సిటిజన్ల వయోపరిమితిని 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించండి.– ఆనంద్, చెన్నై

ఈవో : పరిశీలిస్తాం.

ప్రశ్న : శ్రీవారి సేవ వెబ్‌సైట్‌లో లడ్డూ ప్రసాద సేవ బుక్ చేసుకునే అవకాశం ఉందా?– కిరణ్, హైదరాబాద్

ఈవో : ప్రస్తుతానికి లేదు.

ప్రశ్న : తిరుమలలో పావురాలు ఎక్కువగా ఉన్నాయి. శ్వాస సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. – అనూరాధ, నాయుడుపేట

ఈవో: పావురాల సమస్యను పరిశీలిస్తాం

ప్రశ్న : వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు బాగున్నాయి. వికలాంగులకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేయలేదు.– జగన్, హైదరాబాద్

ఈవో: వైకుంఠ ద్వార దర్శనం రోజుల్లో వికలాంగులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయలేదు. సాధారణ రోజుల్లో ప్రత్యేక క్యూలైన్ ఉంటుంది.

ప్రశ్న : ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లు కలిగిన భక్తులు రాలేకపోతే వాయిదా వేసుకునే అవకాశం కల్పించండి.
– రంగనాథన్, బెంగళూరు, శ్రీనివాస్, మెదక్

ఈవో : వాయిదా వేసుకునే అవకాశం లేదు, దర్శనానికి రాలేని పక్షంలో టికెట్లు రద్దు అవుతాయి.

ప్రశ్న : టీటీడీ ఈ–దర్శన్ కౌంటర్లలో దర్శనం టికెట్ల మంజూరును పునరుద్ధరించండి. – సత్యారావు, విజయనగరం

ఈవో : గతంలో 20 నుంచి 25 ప్రాంతాల్లో కోటా పద్ధతిలో ఈ–దర్శన్ కౌంటర్లలో దర్శనం టికెట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ ఇంటర్నెట్ అందుబాటులో ఉంది. మార్చడం వీలుకాదు.